క్లుప్తంగా

ముంపు ప్రాంతం పరిశీలన



పట్టణంలోని 19వ వార్డు ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: మిచాంగ్ తుఫాన్‌కు జలమయమైన 19వ వార్డ్ ముంపు ప్రాంతాలను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం పరిశీలించారు. వార్డులో చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. ఆయనతో పాటు మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, 19వ వార్డ్ కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కూకుట్ల శ్రీను, వల్లెం నరసింహారావు తదితరులున్నారు.

9 నుంచి అమరావతిలో సత్యాగ్రహ దీక్షలు

అచ్చంపేట: అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ హెల్పర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేందుకు అమరావతిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనెల 9 నుంచి సత్యాగ్రహ దీక్షలు చేపట్టనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు మునగోడు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం అచ్చంపేటలో సత్యాగ్రహ కరపత్రాలను ఆవిష్కరించారు. అగ్రిగోల్డ్ బాధితులంతా తప్పక హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు బైరాపట్నం రామకృష్ణ, సీపీఐ నాయకులు మధు, సంపంగి ఏడుకొండలు, రాణిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్యాబ్‌లు పంపిణీ



నకరికల్లు: భవితకేంద్రాల ద్వారా ప్రభుత్వం దివ్యాంగులకు ఉచితంగా విద్యతో పాటు ఫిజియోథెరపీ సేవలు కూడా అందిస్తున్నట్లు ఎంఈవో-2 ఎస్.ప్రసాద్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని దివ్యాంగులకు గురువారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవితకేంద్రాల ద్వారా దివ్యాంగులను గుర్తించి నైపుణ్యం పెంపొందించేందుకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తారని అన్నారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ వ్యాయామాలు నేర్పించడం, స్పీచ్‌థెరపీ ఇస్తారని అన్నారు. గుండ్లపల్లి ఉన్నత, ఉర్దూ పాఠశాల, చల్లగుండ్లలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఒక్కొక్కరికి ఒక్కో ట్యాబ్ చొప్పున ముగ్గురికి అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర పోస్టర్ల ఆవిష్కరణ



రెంటచింతల: గ్రామీణ ప్రాంతాలలోని యువతలో పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించి ప్రోత్సహించి వారిలో ప్రతిభను గుర్తించడానికే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించినట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మి, వివిధ శాఖాధికారులతో కలిసి ఆడుదాం ఆంధ్ర పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికి ఏదో ఒక ఆటలో ప్రావీణ్యం ఉంటుందని దానిని గుర్తించి ప్రోత్సహించడానికి సీఎం జగన్ తలపెట్టిన ఈ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, పని పట్ల శ్రద్ధ పెరుగుతుందన్నారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యదర్శులకు వివిధ ఆటలకు పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూస్ ఏఈ కొత్తా నరేంద్రారెడ్డి, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

పిడుగురాళ్ల: డిసెంబర్ 9వ తేదీ రెండవ శనివారం పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించటం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీగంగాధర్‌రావు తెలిపారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో పరిష్కరించే విధంగా పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు చూడాలని తెలియజేశారు. అలాగే పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కేసులను సామరస్యపూర్వకంగా రాజీచేసుకొని సత్వర న్యాయం పొందాలని విజ్ఞప్తి చేశారు.

మీ అందరి సహకారం ఉంటే నన్నెవ్వరూ ఓడించలేరు

- గంగమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి రూ.3 లక్షలు విరాళం
- సత్తెనపల్లిలో రజక ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు సహకారం
- వైఎస్సార్ సీపీకి రజకులు అంతా అండగా ఉండటం అభినందనీయం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



మంత్రి అంబటి రాంబాబును సత్కరిస్తున్న పాతపాటి అంజిబాబు, రంగన్న, మందడపు సాయి, ప్రసాద్‌బాబు, వెంకయ్య, కొండలు తదితరులు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో న్యాయంగా, ధర్మంగా పరిపాలన సాగిస్తున్నానని, మీ అందరి సహకారం ఉంటే నన్ను ఎవ్వరు ఓడించలేరని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన రజకుల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి రజక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు అధ్యక్షత వహించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ అంబటి రాంబాబుకు సీటు లేదని కొంతమంది దుష్ప్రచారం చేస్తుంటారని, వాటిని నమ్మవద్దన్నారు. ఇక్కడ పోటీ చేసేది తానేనని, తనను ఓడించడం కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుట్రలు చేస్తున్నారన్నారు. అందుకే మొన్నటి వరకు టీడీపీ జెండాలు మోసి ఖర్చు పెట్టుకున్నవారిని పక్కన పెట్టి గుంటూరు నుంచి ఒక పహిల్‌వాన్‌ను(కన్నా లక్ష్మీనారాయణ)ఇక్కడకు పంపించారన్నారు. పార్టీలు, కండువాలు మార్చే వారిని తాను లెక్క చేయనని, బడుగు, బలహీన వర్గాల సహకారం ఉంటే ఏ పహిల్‌వాన్‌కు తనను ఓడించే శక్తి ఉండదన్నారు. మీ అందరి రుణం తీర్చుకోవలసిన అవసరం తనకు ఉందన్నారు. ధోబీ ఘాట్‌లోని గంగమ్మ తల్లి దేవాలయం అభివృద్ధికి గతంలో ఇచ్చిన మాట ప్రకారం తాను రూ.3 లక్షలు, పాతపాటి అంజిబాబు రూ.2 లక్షలు కలిపి రూ.5 లక్షలు ఇస్తున్నామని, వాటితో దేవాలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. రజక ఐలమ్మ విగ్రహ స్థాపనకు సహకరించేందుకు సిద్ధమన్నారు. రజక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన సత్తెనపల్లిలో రజక ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సహకరిస్తానని చెప్పిన మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గంగమ్మ తల్లి దేవాలయానికి రూ.3 లక్షలు కేటాయించడం అభినందనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో రజకులు అందరూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, సత్తెనపల్లి ఎమ్మెల్యేగా అంబటి రాంబాబును గెలిపించి తీరుతామన్నారు. సమావేశంలో రజక కార్పొరేషన్ చైర్మన్ సుగుమంచి రంగన్న, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు యుద్దగిరి మురళి, రజక సంఘ తుర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, గుడిపూడి సర్పంచ్ తొరటి తిరుపతయ్య, సత్తెనపల్లి బసవయ్యలు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబును పాతపాటి అంజిబాబు, సుగుమంచి రంగన్నలు సత్కరించగా వారిని మంత్రి అంబటి రాంబాబు సత్కరించారు. ముందుగా రజక సంఘ నాయకుడు మందడపు సాయి కనకతప్పట్లతో రజకులను తోడ్కొని వచ్చారు. కంటెపూడి సర్పంచ్ ఇపరాపట్నం యమునాబొబ్బిలి, లంకెలకూరపాడు మాజీ ఎంపీటీసీ గుర్రపుసాల ప్రమీల, రజక సంఘ నాయకులు చామర్తి ఆంజనేయులు, విప్పర్ల పాండురంగారావు, పొట్లూరి శ్రీనివాసరావు, కురిచేటి నాసరయ్య, విప్పర్ల కొండలు, చట్టు సైదారావు, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, కురిచేటి వెంకయ్య, చట్టు శ్రీనివాసరావు, నరసింహారావు, రజకులు, తదితరులున్నారు.



సమావేశానికి హాజరైన మహిళలు



కనకతప్పెట్లతో సమావేశానికి హాజరవుతూ..

క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



మహిళా పోలీసులకు క్రీడాకిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గ్రామీణ ప్రాంతాలలో అనేకమంది క్రీడాకారులు ప్రతిభ ఉండి ప్రోత్సాహం లేక మరుగున పడుతున్నారని, అలాంటి క్రీడాకారుల నైపుణ్యాలను వెలికి తీసి రాష్ట్రస్థాయికి తీసుకెళ్లేందుకే సీఎం జగన్‌మోహనరెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. గ్రామాలలో క్రీడాకారులను సచివాలయాల ద్వారా ప్రోత్సహించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన మహిళా పోలీసులకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉండే ఉత్సాహవంతులైన క్రీడాకారులు తమ పేర్లను గ్రామ సచివాలయాలలో నమోదు చేసుకోవాలన్నారు. ఆడుదాం ఆంధ్రా.ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో, 1902 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోను చేయడం ద్వారా కూడా పేర్లను నమోదు చేసుకోవచ్చని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు. నియోజకవర్గస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.35వేలు, 15వేలు, 5వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.60వేలు, 30వేలు, 10వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినవారికి రూ.5లక్షలు, 3లక్షలు, 2లక్షలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయసిబ్బంది, మహిళా పోలీసులు వీలైనంతమంది క్రీడాకారులు పాల్గొనే విధంగా చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.శివసుబ్రమణ్యం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వైస్ ఎంపీపీ గంగసానిబాబు, ఎంపీటీసీ నటరాజు, సర్పంచ్ కంబాల వీరబాబు, సుంకర శ్రీనివాసరెడ్డి, సచివాలయ మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తుఫాన్ వర్షానికి పడిపోయిన ఇల్లు

గుడిపాడు(క్రోసూరు): మిచాంగ్ తుఫాన్ వర్షానికి మండలంలోని గుడిపాడు ఎస్సీ కాలనీలో ఇల్లు పడిపోయింది. గనుపల్లి విజయరాజుకు చెందిన పెంకుటిల్లు వర్షానికి పడిపోయింది. అదృష్టవశాత్తు సమయానికి తన బంధువుల ఇంట్లో ఉండటం వలన ప్రమాదం తప్పింది. వీఆర్వో తిరుమలరావు ఇల్లు పడిపోయిన పంచనామ వివరాలు తహసీల్దార్ డి.శ్రీనివాసరావుకు అందించటం జరిగింది. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని బాధితుడికి అందించనున్నట్లు తహసీల్దార్ చెప్పారు. నిత్యావసర సరుకులు, బియ్యం అందిస్తామని అన్నారు.



పడిపోయిన ఇంటి ముందు విజయరాజు కుటుంబం

అన్నదాతలను అన్నివిధాల ఆదుకుంటాం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ఓర్వకల్లు, రుద్రవరం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



బయ్యవరం గ్రామంలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: అన్నదాతలను అన్ని రకాలుగా ఆదుకుంటాం, తడిసిన ప్రతి పంటను మద్దతుధరకే మార్కెట్‌యార్డుల ద్వారా కొనుగోలు చేస్తాం. రైతులెవ్వరూ అధైర్యపడొద్దంటూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రైతులకు ఊరటనిచ్చారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులు కురిసిన వర్షాలకు నీటమునిగిన వరి, మిర్చి, పత్తి, పసుపు, పొగాకు తదితర పంటలను గురువారం ఆయన పరిశీలించారు. మండలంలోని ఓర్వకల్లు, రుద్రవరం, చిగురుపాడు, అచ్చంపేట, వేల్పూరు, గ్రంథశిరి గ్రామాలలో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పారు. ఎవ్వరూ అధైర్యపడొద్దన్నారు. పంట నష్టాలపై వెంటనే సర్వే నిర్వహించి నివేదికలు తయారు చేయాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరుతో మాట్లాడి ప్రత్యేక కొంటర్ల ద్వారా తడిసిన ధాన్యాన్ని, రంగుమారిన పత్తిని, ఇతర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపడతానన్నారు. ప్రభుత్వం రైతు పక్షాన ఉంటుందని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని, రైతుల శ్రేయస్సు కోసం ఎలాంటి చర్యలైనా తీసుకుంటారని చెప్పారు. నష్టపోయిన కౌలు రైతుల వివరాలను తీసుకుని పంట నష్టాలపై సాధ్యమైనంత త్వరలో నివేదికలు పంపాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు.

ఆయన వెంట క్రోసురూ మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, జిల్లా పార్టీ కార్యదర్శి సుంకర శ్రీనివాసరెడ్డి, అచ్చంపేట, ఓర్వకల్లు గ్రామాల సర్పంచులు కంబాల వీరబాబు, పేరిపోగు పేరయ్య, అచ్చంపేట గ్రామ పార్టీ కన్వీనర్ షేక్ సమరం, వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు, ఏవో వెంకటేశ్వర్లు, వ్యవసాయ సిబ్బంది, ఆర్బీకే సిబ్బంది, రైతులు ఉన్నారు.

తుఫాన్‌కు నష్టపోయిన అన్నదాతలను ఆదుకుంటాం

క్రోసూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల నష్టం చాలా వరకు తగ్గిందని, వర్షాలకు నష్టపోయిన అన్నదాతలను ప్రభుత్వం ఆదుకుంటుందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. గురువారం క్రోసూరు మండలంలోని గ్రామాల్లో తుఫాన్ ప్రభావిత పంటలను ఆయన పరిశీలించారు. తుఫాన్ వల్ల గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల రైతులు ఎక్కువ నష్టపోయారన్నారు. వర్షం తగ్గిన వెంటనే విద్యుత్ పునరుద్ధరణ జరిగిందన్నారు. కూలిపోయిన చెట్లను తొలగించి రవాణా ఏర్పాట్లు చేశారన్నారు. మరోవైపు అధికారులు పంట నష్టం అంచనాలు సిద్ధం చేస్తున్నారన్నారు. పొలాల్లో నీరు తొలగించేందుకు చర్యలు చేపట్టారన్నారు. పంట నష్టం అంచనాలు త్వరగా పూర్తి చేసి.. ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. వీలైనంత త్వరలో అన్నదాతలకు నష్టపరిహారం అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

చకచకా విద్యుత్ పునరుద్ధరణ పనులు





విరిగిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

విద్యుత్‌శాఖకు రూ.3లక్షలు నష్టం

రాజుపాలెం: మండలంలో మిచాంగ్ తుఫాన్ వలన విద్యుత్ శాఖకు భారీ నష్టం వాటిల్లినట్లు మండల విద్యుత్ ఏఈ వీవీ ప్రసాద్ గురువారం తెలిపారు. మండలంలో తుఫాన్ ఈదురుగాలులకు ఇనిమెట్లలో 9స్తంభాలు, మొక్కపాడులో 7స్తంభాలు, గణపవరంలో 4, ఉప్పలపాడులో 3, రాజుపాలెంలో 3, రెడ్డిగూడెంలో 2, అనుపాలెంలో 2, అంచులవారిపాలెంలో 2 స్తంభాల చొప్పున మొత్తం 32 స్తంభాలు విరిగిపోయినట్లు తెలిపారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి వేసినట్లు తెలిపారు. అదే విధంగా 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లు రెండు దెబ్బతిన్నట్లు తెలిపారు. తుఫాన్ వలన విద్యుత్ శాఖకు రూ.3 లక్షలు నష్టం జరిగినట్లు ఏఈ చెప్పారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు తెలియజేశారు. పవిత్ర కార్తీక మాసంలో ఆఖరి వారం ఆదివారం రాత్రి 8 గంటల నుంచి పంచారామాలకు, అన్నవరం, ద్వారాక తిరుమలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఈ నెల 24వ తేదీన ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు అరుణాచల గిరి ప్రదక్షిణకు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. విజ్ఞాన, విహారయాత్రలకు అద్దె ప్రాతిపదికన విద్యా సంస్థలకు రాయితీతో బస్సులను ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలియజేశారు. ధనుర్మాసం వైష్ణవ దేవాలయాల యాత్రలకు ఈ నెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు కోరిన రోజున అద్దె బస్సులను కల్పించటం జరుగుతుందన్నారు. శబరిమల 5 లేకా 7 రోజుల యాత్ర కొరకు లగ్జరీ బస్సు సౌకర్యం కలదని తెలిపారు. వివరాలకు డిపో మేనేజర్ 62210 85541,98495 056304 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

తుఫాన్ ప్రభావిత పంటల పరిశీలన



చేజర్లలో వరిపంటను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు



నందిగామలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పుష్పారాణి, రైతులు



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి జనని

ముప్పాళ్ళ: తుఫాన్ ప్రభావంతో పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని వెంటనే కాల్వల ద్వారా బయటకు పంపి, యాజమాన్యచర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు డా.బి.శ్రీకాంత్, డా.వై.పుష్పారాణిలు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను మండల వ్యవసాయాధికారి ఎం.అరుణతో కలిసి గురువారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరి గింజలు మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉండేందుకు 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. కంది, మొక్కజొన్న, శనగ, మినుము పొలాల్లో నిలిచిన నీటిని బయటకు వెళ్ళగొట్టాలన్నారు. ఎకరాకు ఒక కేజీ మల్టీ-కే ను 20లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కందిలో ఎకరాకు 20కేజీల యూరియా, 10కేజీల పొటాష్, మొక్కజొన్నలో ఎకరాకు 50కేజీల యూరియా,20 కేజీల పొటాష్ కలిపి చల్లుకోవాలని సూచించారు. శనగలో లీటరు నీటికి 5గ్రాముల ఫెర్రస్‌సల్ఫేట్ 0.5గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మిర్చిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఆకుమచ్చ తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్త చర్యగా 10లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్‌ఆక్సీక్లోరైడ్, 2గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ కలిపి పిచికారీ చేసి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు.

పంటనష్టం ప్రాథమిక అంచనా

నకరికల్లు: ప్రతిగ్రామంలోను పర్యటించి తుఫాన్ ప్రభావానికి గురైన పొలాలన్నిటిని గుర్తిస్తామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు అన్నారు. మండలంలోని చేజర్ల, కుంకలగుంట తదితర గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి-445 హెక్టార్లు, శనగ-825 హెక్టార్లు, కంది-828 హెక్టార్లు, మినుము-185 హెక్టార్లు, మొక్కజొన్న-306 హెక్టార్లు, మిర్చి-253 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన పంటల వివరాలు, రైతుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామని అన్నారు. రైతులు మాత్రం పంటల నష్టం శాతం తగ్గించుకునేందుకు వ్యవసాయాధికారుల సూచనలు తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పుష్పారాణి

సత్తెనపల్లి: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాం ఫాం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.శ్రీకాంత్, డాక్టర్ వై.పుష్పారాణిలు చెప్పారు. మిచాంగ్ తుఫాన్ వర్షాల దృష్ట్యా దెబ్బతిన్న పంటల పరిశీలనలో భాగంగా సత్తెనపల్లి మండలం నందిగామ, కంటిపూడి, కట్టమూరు గ్రామాల పరిధిలో మిరప, పత్తి, వరి పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిరప పొలంలోని నీరు బయటకు వెళ్ల బెట్టి ఎకరాకు 50కేజీల యూరియా, 25కేజీల పొటాష్ ఎరువులను, 200కేజీల వేప పిండి ఎండగా ఉన్నపుడు పొలంలో చిమ్ముకోవాలని సూచించారు. వర్షాలు తగ్గిన తర్వాత అంతర కృషి చేసుకోవాలని సూచించారు. మిరపలో వడలిన మొక్కలకు 5గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మిరపలో ఆకు మచ్చ, కాయ కుళ్లు నివారణకు కాపర్‌ఆక్సీక్లోరైడ్ ఎకరాకు 600 గ్రాములు, స్ట్రెప్టో సైక్లిన్ 20 గ్రాములు లేదా కార్బెండిజమ్ 500గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు. శనగలో ఇనుపధాతు లోప నివారణకు ఫెర్రస్ సల్ఫేట్ 5గ్రాములు, సిట్రిక్ యాసిడ్ 0.5 గ్రాములు, యూరియా 20గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అదే విధంగా వారం రోజుల తర్వాత 19.19.19 లేదా పొటాషియం నైట్రేట్ పైపాటుగా పిచికారీ చేయాలని సూచించారు. వరి పంటలో కోత కోసిన గింజ తడిచినట్లైతే మొలకెత్తకుండా ఉండటానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై చల్లు కోవాలన్నారు.

దెబ్బతిన్న ఉద్యాన పంటల పరిశీలన

సత్తెనపల్లి: మిచాంగ్ తుఫాన్ వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటల పరిశీలనలో భాగంగా మండలంలోని ఫణిదం, భట్లూరు గ్రామాలలోని మిరప పంటను ఉద్యాన శాఖ అధికారి జనని గురువారం పరిశీలించారు. ఉద్యాన పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు ఉన్నారు.

మండలంలో తుఫాన్ నష్టం అంచనాలు..

క్రోసూరు: మిచాంగ్ తుఫాన్ వర్షాలకు మండలంలో పంటలు, విద్యుత్, పశువులు, ఇళ్ల తదితర నష్టంపై ప్రాథమిక సమాచారం తహసీల్దార్ డి.శ్రీనివాసరావు తెలియజేశారు. మండలంలో పంట నష్టం వివరాలు వరి మొత్తం 690 హెక్టార్లలో సాగు చేయగా 84 హెక్టార్లు పూర్తిగా నష్టపోయినట్లు తెలిపారు. 431 హెక్టార్లు వరి పంట నీట మునిగినట్లు తెలిపారు. అదేవిధంగా మిర్చి పంట మొత్తం 1800 హెక్టార్లలో సాగు చేయగా 10 హెక్టార్ల పంట నీట మునిగి పాడైనట్లు, 340 హెక్టార్లు తడిసినట్లు తెలిపారు. పుల్లశనగ 105 హెక్టార్లు సాగు చేయగా మొత్తం పాడైనట్లు తెలియజేశారు. అదేవిధంగా విద్యుత్ శాఖ పరంగా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పాడవ్వగా, 10 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు చెప్పారు. వీటికి సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. అదేవిధంగా పశువులలో నాలుగు గొర్రెలు, ఒక గేదె, ఒక దూడ మృత్యువాత పడినట్లు చెప్పారు. మొత్తం రూ.70 వేలు నష్టం వాటిల్లిందని చెప్పారు. అదేవిధంగా మండలంలోని గుడిపాడు గ్రామంలో ఒక ఇల్లు పడిపోయిందన్నారు.

గురుకుల సంక్షేమ హాస్టల్ సందర్శన



హాస్టల్‌ను సందర్శిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, న్యాయమూర్తి మురళీ గంగాధరరావు

పిడుగురాళ్ల: పట్టణంలోని గురుకుల సంక్షేమ బాలికల హాస్టల్‌ను మండల స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, న్యాయమూర్తి మురళీగంగాధర్‌రావు సందర్శించారు. స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు మాట్లాడుతూ... ఈ నెల 5వ తేదీ ఉదయం విద్యార్థులకు భోజనం సక్రమంగా అందలేదని దానిపై ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్, వంట మనిషి, విద్యార్థులతో చర్చించటం జరిగిందని దీనికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపించటం జరుగుతుందని తెలిపారు. న్యాయమూర్తి గంగాధర్‌రావు హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం యూటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు సర్వీసు రూల్స్, బదిలీలు, పీఎఫ్ అకౌంట్స్ త్వరగా కల్పించాలని, మున్సిపల్ పరిధిలో డీవైఈవై పోస్టులు, అర్బన్‌లో ఎంఈవో పోస్టులు కేటాయించాలన్నారు. ఏళ్లతరబడి లేని ప్రమోషన్లు, తదితర డిమాండ్లను వెంటనే కల్పించాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డి.కోటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామ పరిధిలోని జంగాలపల్లె రోడ్డులో ఉన్న శ్మశాన వాటిక వద్ద కోతముక్క ఆడుతున్న పేకాట స్థావరంపై నాదెండ్ల పోలీసులు దాడి చేశారు. 9 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.5200లు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపారు.